




# బహుజన వేదిక

తెలుగు జాతీయ దినపత్రిక



ANANTHAPURAM I KURNOOL I KADAPA I AMARAVATHI HYDERABAD I VIJAYAWADA I VISHAKAPATNAM I GUNTUR I PRAKASAM I RAJAMANDRI I TADEPALLIGUDEM I KHAMMAM I KARIMNAGAR I I NALGONDA I


సంపుటి : 2 సంచిక : 327 గురువారం 16 జూలై 2026 ఎడిటర్ : పి రామాంజనేయ ప్రసాద్ వెల : 5/- పేజీలు : 8 Email : bahujanavedikaap@gmail.com


## ప్రాథమిక నివేదికలో కీలక అంశాలు



- రామమందిర విరాళాల వ్యవహారం
- 24-48 గంటల్లో యూపీ ప్రభుత్వానికి సిట్ తుది నివేదిక!
- ముగింపు దశకు రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై సిట్ దర్యాప్తు
- 70 అనుమానాస్పద ఘటనలు సీసీటీవీలో గుర్తించినట్లు ప్రాథమిక నివేదిక వెల్లడి
- దర్యాప్తు కోరిన పిటిషన్లపై కేంద్రం, యూపీ ప్రభుత్వం, ట్రస్ట్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

## పార్లమెంట్‌లో స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులకు నో



- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం సూచనలు
- వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం బులెటిన్ విడుదల
- భద్రత, వ్యక్తిగత గోప్యత దృష్ట్యా స్మార్ట్ పరికరాలు ధరించవద్దని సూచన
- పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, ప్లకార్డులు, ఏఐ పోస్టర్ల ప్రదర్శనకూ నిషేధం



### చంద్రబాబు పాలనలో

# రైతులకు అవస్థలు

నేను ఉన్నాను..
మీ కష్టాలు నాకు తెలుసు

ఆక్వా రైతులకు వైయస్ జగన్ భరోసా

ఆక్వా రైతుల ముఖాముఖిలో వైయస్ జగన్

భీమవరంబహుజన వేదిక

చంద్రబాబు ఎప్పుడు వచ్చినా, రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతారని, ఇంకా ఆక్వా రంగం పరిస్థితి దారుణంగా మారుతుందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పుడు కూడా ఏ ఒక్క పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని, మరోవైపు ఆక్వా సాగు రంగం దుర్భరస్థితిలో కొట్టుమిట్టాడుతోందని ఆయన గుర్తు చేశారు. ఒకవైపు ఆక్వా సీడ్, ఫీడ్ ధరలు దారుణంగా పెరగ్గా, మరోవైపు పంట కొనుగోలు ధరలు - మిగతా3లో

సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అమరావతి నిర్మాణం

అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్‌పై సీఎం సమీక్ష

ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన

ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ స్థాయి నగరం

ప్రణాళికపై సింగపూర్ ప్రతినిధుల ప్రజెంటేషన్

### అమరావతి 2.0

# మాస్టర్ ప్లాన్



అమరావతి బహుజన వేదిక

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఫ్రూజ్-2) పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా - మిగతా3లో

### 3 సంవత్సరాలు..

# 36 ప్రాజెక్టులు

- అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం
- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు



అమరావతిబహుజన వేదిక

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' - మిగతా3లో



### పోలీసుల వైఫల్యం వల్లే

# ఈ ఘోరం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ

పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి

పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం

బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం




- అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవం సందర్భంగా కొత్త నాణెం
- ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో 1 డాలర్ నాణెం విడుదల
- దేశభక్తికి, స్వేచ్ఛకు ప్రతీకగా ఈ నాణెం అని తెలిపిన ట్రెజరీ విభాగం



## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన

- ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఈసీ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్
- నకిలీ, వలస వెళ్లిన ఓటర్లను తొలగించి, అర్హులను చేర్చడమే లక్ష్యం
- ఇప్పటికే ముగిసిన రెండు దశలు
- ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో మూడో దశ సర్వే
- ఏపీలో ఇంటింటి సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు




## మీ బ్యాంకు లావాదేవీలపై ఐటీ నిఘా

- ఈ పొరపాట్లు చేస్తే నోటీసులు ఖాయం!
- సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలు దాటిన నగదు డిపాజిట్లపై ఐటీ శాఖ దృష్టి
- క్రెడిట్ కార్డు బిల్లులకు రూ.10 లక్షలు దాటిన చెల్లింపులపై నిఘా
- రూ.30 లక్షలు దాటిన ఆస్తి కొనుగోలు, అమ్మకాలపై సమీక్ష
- లావాదేవీలకు, ఐటీఆర్‌కు పొంతన లేకపోతే భారీ జరిమానా ప్రమాదం

# ప్రాథమిక నివేదికలో కీలక అంశాలు

అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో 24 నుంచి 48 గంటల్లో ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వానికి తన తుది నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ నివేదిక గురువారం లేదా శుక్రవారం ప్రభుత్వానికి అందే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో సిట్ దర్యాప్తు గడువును ఇకపై పొడిగించే అవకాశం లేదని కూడా తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తును మరింత విస్తృతంగా చేపట్టేందుకు ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం జూలై 1న సిట్‌కు 15 రోజుల గడువు పొడిగించింది. విరాళాల లెక్కింపు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు, నగదు నిర్వహణ, సంబంధిత సిబ్బంది పాత్ర వంటి అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ జరిపిన అనంతరం తుది నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

సిట్ ఇప్పటికే సమర్పించిన ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 2026 మధ్య కాలంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా సుమారు 70 అనుమానాస్పద ఘటనలు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. నగదు లెక్కింపు బాధ్యతలు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది నగదు కట్టలను దాచిపెడుతున్న దృశ్యాలు సీసీటీవీలో నమోదైనట్లు అందులో ప్రస్తావించింది. అలాగే విరాళాల దుర్వినియోగానికి దారితీసిన పలు లోపాలను కూడా సిట్ గుర్తించింది. నగదు లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో సిబ్బందిని తనిఖీ చేయకపోవడం, వ్యక్తిగత వస్తువులపై సరైన నియంత్రణ లేకపోవడం, వేర్వేరు హుండీల నుంచి వచ్చిన నగదును ఒకేసారి కలిపి లెక్కించడం వంటి అంశాలు ఈ ఘటనకు అవకాశం కల్పించినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.



### నగదు స్వాధీనం

దర్యాప్తు ప్రారంభానికి ముందే కొందరు ఉద్యోగుల వద్ద నుంచి రూ.78.94 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా జూన్ 4న నగదు లెక్కింపు గదికి ఆనుకుని ఉన్న బాత్‌రూమ్‌లో మరో రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సిట్ తెలిపింది. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన వెండి ఇటుకలు, ఇతర విలువైన కానుకలు కనిపించకుండా పోయాయన్న ఆరోపణలకు ఇప్పటివరకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లభించలేదని కూడా సిట్ తన నివేదికలో స్పష్టం చేసింది.

### ఎనిమిది మంది నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల జ్యుడీషియల్ కస్టడీని అయోధ్య కోర్టు మరో 14 రోజుల పాటు పొడిగించింది. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నెల 27న వారిని మరోసారి కోర్టు ఎదుట హాజరుపరచనున్నారు. రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై స్వతంత్రంగా, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇటీవల విచారణకు స్వీకరించింది.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తన దర్యాప్తు పురోగతిపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే సిట్‌లో ఉన్న సభ్యుల వివరాలను కూడా అందించాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

### ట్రస్ట్‌లో రాజీనామాలు

విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ట్రస్ట్ అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ సభ్యులు అనిల్ మిశ్రా, గోపాల్ రావు రాజీనామాలు చేశారు. ట్రస్ట్ వారి రాజీనామాలను ఆమోదించింది. ఇప్పుడు సిట్ తుది నివేదికపై అందరి దృష్టి నెలకొంది. ఈ నివేదిక ఆధారంగా ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు సుప్రీంకోర్టు విచారణ, సిట్ నివేదిక, కోర్టులో కొనసాగుతున్న కేసు పరిణామాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారనున్నాయి.

# మీ బ్యాంకు లావాదేవీలపై ఐటీ నిఘా..

వేతన జీవులు సైతం తమ సాధారణ బ్యాంకింగ్ లావాదేవీల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ హెచ్చరిస్తోంది. అధిక విలువ కలిగిన కొన్ని రకాల లావాదేవీలు ఆటోమేటిక్ వ్యవస్థల ద్వారా నేరుగా ఐటీ శాఖ దృష్టికి వెళతాయని, ఫలితంగా నోటీసులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా ఈ పర్యవేక్షణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 285దీూ ప్రకారం, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు నిర్దేశిత ఆర్థిక లావాదేవీల వివరాలను తప్పనిసరిగా ఐటీ శాఖకు నివేదించాల్సి ఉంటుంది. ఈ సమాచారం పన్ను చెల్లింపుదారుల వార్షిక సమాచార నివేదిక (ూ×ూ) మరియు ఫామ్ 26ూూలో ప్రతిబింబిస్తుంది. దాఖలు చేసిన ఐటీ రిటర్న్‌తో ఈ వివరాలు సరిపోలకపోతే, పన్ను ఎగవేత ఉద్దేశం లేకపోయినప్పటికీ ఐటీ శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉంది.




### ఐటీ శాఖ నిఘాలో ఉన్న ప్రధాన లావాదేవీలు

నగదు డిపాజిట్లు: ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు జమ చేసినట్లయితే, ఆ వివరాలు ఐటీ శాఖకు చేరతాయి. వేర్వేరు సందర్భాల్లో డిపాజిట్ చేసినప్పటికీ, బ్యాంకింగ్ వ్యవస్థలు వాటన్నింటినీ కలిపి లెక్కిస్తాయి.

**క్రెడిట్ కార్డ్ చెల్లింపులు:** క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపుల కోసం నగదు రూపంలో రూ.1 లక్ష లేదా డిజిటల్ బదిలీల ద్వారా ఏడాదికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసినా నిఘా ఉంటుంది. ప్రకటించిన ఆదాయానికి, చేసే ఖర్చులకు పొంతన లేకపోతే ఐటీ శాఖ నుంచి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి రావొచ్చు.

**ఆస్తి లావాదేవీలు:** రూ.30 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన స్థిరాస్తుల కొనుగోలు లేదా విక్రయ లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖ నిశితంగా పరిశీలిస్తుంది.

**నిరుపయోగ ఖాతాలు:** సుదీర్ఘ కాలంగా వాడకంలో లేని ఖాతాలో అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో నగదు జమ అయినా లేదా విత్‌డ్రా చేసినా అది ఐటీ శాఖ దృష్టికి వెళుతుంది.

**విదేశీ లావాదేవీలు:** ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు దాటిన విదేశీ కరెన్సీ కొనుగోళ్లు, ఇతర అంతర్జాతీయ లావాదేవీలను కూడా అధికారులు నిశితంగా గమనిస్తారు.

ఆర్థిక పారదర్శకతను పెంచడం, పన్ను ఎగవేతలను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిబంధనలను కఠినతరం చేశారు. ఆస్తి దస్తావేజులు, రుణాలు, గిఫ్ట్ డీడ్‌లు వంటి సరైన పత్రాలు ఉన్న లావాదేవీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఐటీ నోటీసులకు స్పందించకపోయినా లేదా లెక్కలు సరిగా చూపలేకపోయినా చెల్లించాల్సిన పన్నుపై 50 శాతం నుంచి 200 శాతం వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. కాబట్టి, పన్ను చెల్లింపుదారులు జూలై 31 లోపు ఐటీఆర్ దాఖలు చేసే ముందు తమ ూ×ూను సమీక్షించుకుని, అన్ని ఆదాయ వనరులను కచ్చితంగా వెల్లడించడం ఉత్తమం.

# కర్ణాటకలో కేబినెట్ విస్తరణకు కౌంట్‌డౌన్!

కర్ణాటక రాజకీయాల్లో కేబినెట్ విస్తరణ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీ పర్యటనతో రాష్ట్ర కాంగ్రెస్‌లో మంత్రి పదవులపై చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చాలా కాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మంత్రి పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. బుధవారం సాయంత్రం దిల్లీకి వెళ్లిన డీకే శివకుమార్, కేంద్ర మంత్రులతో భేటీ అవుతారని అధికారిక షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం ఆయన పార్టీ అగ్రనేతలతో కూడా సమావేశమయ్యే అవకాశముంది. ఇటీవలే కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు శివకుమార్ వెల్లడించారు. అధిష్ఠానం సమయం ఇచ్చిన వెంటనే దిల్లీకి వెళ్తానని ఆయన పేర్కొన్నారు. దిల్లీ పర్యటనకు ముందు డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన నివాసంలో కలిసి చర్చలు జరపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను శివకుమార్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కేబినెట్ విస్తరణకు సంబంధించిన అంశాలపైనే ఇద్దరు నేతల మధ్య చర్చలు జరిగాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### భారీ సంఖ్యలో ఖాళీలు

ఇదే సమయంలో సిద్ధరామయ్య కూడా దిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య వెల్లడించారు. కేబినెట్ విస్తరణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ భావిస్తోందన్నారు. రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైందని చెప్పారు. ఇప్పుడు హైకమాండ్ రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచిందని, సమావేశాల అనంతరం మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక మంత్రివర్గంలో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 13 మంది మంత్రులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో మంత్రివర్గ గరిష్ఠ బలం ముఖ్యమంత్రితో కలిపి 34 మంది వరకు ఉండొచ్చు. అంటే ప్రస్తుతం ఇంకా 20 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. మంత్రి పదవుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, సామాజిక వర్గాల ప్రతినిధులు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మద్దతుదారులు బహిరంగంగా ఆందోళనలు కూడా నిర్వహించారు. బళ్లారిలో కమ్మి ఎమ్మెల్యే జేఎన్ గణేశ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని మద్దతుదారులు ర్యాలీలు నిర్వహించిన ఘటన కూడా ఇటీవల చర్చనీయాంశమైంది. అయితే ఇలాంటి ఒత్తిళ్లను కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది. జూన్ 24న ఎమ్మెల్యేలు, మఠాధిపతులు, సామాజిక వర్గాల నాయకులు మంత్రి పదవుల కోసం బహిరంగ లాబీయింగ్ చేయవద్దని స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. నిర్ణయాలు ఒత్తిళ్ల ఆధారంగా కాకుండా పార్టీ అవసరాలు, ప్రాంతీయ సమతుల్యత, సామాజిక ప్రాతినిధ్యం, ప్రజా పనితీరు వంటి అంశాల ఆధారంగానే ఉంటాయని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణ కాంగ్రెస్‌కు సవాలుగా మారింది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆశావహుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. అందరికీ అవకాశం కల్పించడం సాధ్యం కాకపోవడంతో అసంతృప్తిని ఎలా నియంత్రిస్తారన్నది పార్టీకి పెద్ద పరీక్షగా మారింది. ముఖ్యంగా లింగాయత, వొక్కలిగ, దళిత, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటక ప్రాంతాల మధ్య సమతుల్యత కూడా పాటించాల్సి ఉంటుంది. ఇక బీకే హరిప్రసాద్ వంటి సీనియర్ నేతలకు మంత్రి పదవులు దక్కే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది.

## పార్లమెంట్‌లో స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులకు నో



జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం సభ్యులకు పలు కీలక సూచనలు చేసింది. సమావేశాల సమయంలో భద్రతతో పాటు సభ్యుల వ్యక్తిగత గోప్యతను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించవద్దని కోరింది. దేశంలో ప్రస్తుతం సులభంగా అందుబాటులో ఉన్న ఈ స్మార్ట్ పరికరాలను రహస్యంగా చిత్రాలు, వీడియోలు తీయడానికి లేదా ఇతరుల గోప్యతకు భంగం కలిగించే విధంగా ఉపయోగించే అవకాశం ఉందని లోక్‌సభ సచివాలయం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎంపీలు అలాంటి పరికరాలకు దూరంగా ఉండాలని బులెటిన్‌లో విజ్ఞప్తి చేసింది. అలాగే పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శన, ఆయుధాల ప్రదర్శన, మతపరమైన కార్యక్రమాల నిర్వహణ వంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు, అవమానకర నినాదాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లను కూడా ప్రదర్శించరాదని పేర్కొంది. సమావేశాల సమయంలో ఇతర సభ్యులు తమ ఛాంబర్లకు సులభంగా వెళ్లేలా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించవద్దని ఎంపీలకు సూచించింది. గత బడ్జెట్ సమావేశాల సమయంలో సస్పెన్షన్‌కు గురైన కొందరు ఎంపీలు పార్లమెంట్ గేటు వద్ద నిరసనలు చేపట్టిన నేపథ్యంలో ఆ మార్గదర్శకాలను మరోసారి గుర్తు చేసింది. పార్లమెంట్ కార్యకలాపాలు ప్రశాంతంగా, అంతరాయం లేకుండా సాగేందుకు సభ్యులంతా నిబంధనలు పాటించాలని లోక్‌సభ సచివాలయం కోరింది.

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం




అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ (వి1) నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ బుధవారం వెల్లడించారు. ఈ నాణేనికి ఒకవైపు ట్రంప్ చిత్రం ఉండగా, దానిపై "లిబర్టీ", దిగువన "1776-2026" అనే సంవత్సరాలను ముద్రించారు. చిత్రానికి పక్కన "ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్" అని వాక్యం ఉంటుంది. నాణేనికి రెండో వైపు రెక్కలు విప్పిన గద్ద, దాని మధ్యలో 250వ సంఖ్యతో కూడిన రక్షణ కవచం (షీల్డ్) ఉంటుంది. దానిపై "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా", "వన్ డాలర్" అనే అక్షరాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అమెరికా 250 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ, స్వేచ్ఛకు, దేశభక్తికి చిహ్నంగా ఈ కొత్త బంగారు నాణేన్ని యూఎస్ మింట్ ముద్రించనుంది. ట్రంప్ చిత్రంతో కూడిన ఈ నాణెం అమెరికా విలువలను, స్వేచ్ఛను పరిరక్షిస్తామన్న దేశ నిబద్ధతను చాటుతుంది" అని పేర్కొన్నారు. సాధారణంగా అమెరికాలో జీవించి ఉన్న అధ్యక్షుల చిత్రాలను కరెన్సీపై ముద్రించకూడదనే నిబంధన ఉంది. అయితే, 250వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికల కోసం చట్టంలో మినహాయింపులు ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. గతంలో 1926లో అప్పటి అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ చిత్రంతో నాణేన్ని విడుదల చేసిన ఉదాహరణను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ట్రంప్ చిత్రంతో డాలర్ నాణేన్ని ఎప్పుడు విడుదల చేస్తారు, ఎన్ని ముద్రిస్తారు అనే వివరాలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. కాగా, ఈ నిర్ణయంపై ప్రస్తుతం మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన

దేశంలో ఎన్నికలను మరింత పారదర్శకంగా, కచ్చితత్వంతో కూడిన ప్రక్రియగా మార్చే దిశగా భారత ఎన్నికల సంఘం ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నకిలీ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ప్రత్యేక ఓటరు జాబితాల సమగ్ర సవరణ' పేరిట ఈ దేశవ్యాప్త ప్రక్షాళన జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో విజయవంతమైన ఈ ప్రక్రియ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ూ×= అంటే ఏమిటి, అది ఎలా జరుగుతుంది, ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో సమగ్రంగా పరిశీలిద్దాం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను సమూలంగా సవరించే ప్రక్రియ. బూత్ లెవల్ అధికారులు (దీూాం) ప్రతి ఇంటికీ వెళ్లి, పాక్షికంగా నింపి ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను అందించి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరిస్తారు. దీని ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో శుద్ధి చేయడం. మరణించిన వారు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఓట్లు ఉండటం (నకిలీ ఓట్లు), శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, పౌరసత్వం లేని వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం ఈ ప్రక్రియలో కీలకం. అదే సమయంలో, అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేని వారిని చేర్చడం ద్వారా స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణకు వీలు కల్పించడం ఎన్నికల సంఘం లక్ష్యం.

2025 అక్టోబర్ 27న ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ ప్రక్రియపై కొన్ని రాజకీయ పక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. 2026 మే నెలలో సర్వోన్నత న్యాయస్థానం దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగానే ఉందని, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగపరమైన బాధ్యత అని పేర్కొంటూ దాని చట్టబద్ధతను సమర్థించింది. మొదటి దశ (బీహార్): ప్రయోగాత్మకంగా తొలి దశను బీహార్‌లో 2025 జూన్-సెప్టెంబర్ మధ్య చేపట్టారు. ఈ పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఇది అక్కడి మొత్తం ఓటర్లలో దాదాపు 5-6 శాతానికి సమానం. రెండో దశ (9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు): బీహార్ ప్రయోగం విజయవంతం కావడంతో, రెండో దశను ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా మొత్తం 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించారు. ఈ దశలో సుమారు 51 కోట్ల ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల పేర్లు, పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయి. ఈ ప్రక్రియ కోసం 5.3 లక్షల మంది బీఎల్‌వోలు, 7.64 లక్షల మంది బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాలు) పనిచేశారు.

# చంద్రబాబు పాలనలో రైతులకు అవస్థలు



-మొదటిపేజీ తరువాయి

పతనమయ్యాయని చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా.. ఇదే పరిస్థితి కొనసాగుతోందన్న ఆయన, పలు అంశాలు ప్రస్తావించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న వైయస్ జగన్, వారికి భరోసా ఇచ్చారు. 'నేను ఉన్నాను. మీ కష్టాలు నాకు తెలుసు' అంటూ ఆక్వా రైతులకు ధైర్యం చెప్పారు. రాబోయేది తమ ప్రభుత్వమే అన్న వైయస్ జగన్, తాము రాగానే ఆక్వాలో ఇప్పుడున్న సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పెకిలించి వేస్తామని, 'అప్సడా'కు పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. భీమవరంలో ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో వైయస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే.. ఈరోజు మీరు చూపిస్తున్న ఈ ఆదరణ, అభిమానానికి నిజంగా నోటిలో నుంచి మాట కూడా రానంతగా భావోద్వేగం. ఇసుక వేసినా రాలనంతగా కంటి చూపు మేరలో ఎక్కడా కూడా ఖాళీ స్థలం కనిపించనంతగా, ఈ అభిమాన తరంగాల మధ్య మీరు చూపిస్తున్న ఈ ప్రేమ, ఈ అభిమానానికి ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు, ప్రతి తాతకు, ప్రతి సోదరుడికి, ప్రతి స్నేహితుడికి ముందుగా రెండు చేతులు జోడించి పేరు పేరున హదయపూర్వకంగా కతజ్ఞతలు తెలుపుకుంటూ ఉన్నాను. ఈరోజు రాష్ట్రంలో పరిస్థితి గమనిస్తే లక్షన్నరకు పైగా రైతులు ఐదు లక్షలకు పైగా ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దాదాపు 15 లక్షల మందికి ఆక్వా రంగం ఉపాధి కల్పిస్తోంది. కానీ ఈ రంగంలో పరిస్థితులు చూస్తే, మానవత్వం ఉన్న ఏ ఒక్కరికైనా కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. అంత దయనీయమైన పరిస్థితిలో ఈరోజు ఆక్వా రంగం ఉంది. ఇష్టానుసారంగా ఫీడ్ ధరలను పెంచుకుంటూ పోతున్నారు. నిజానికి ఫీడ్ ధరల పెంపు అనేది రైతుల అంగీకారంతోనే జరగాలి కానీ, ఏకపక్షంగా కాదు. ఫీడ్ ధరలు పెంచాలంటే సమీక్ష జరగాలి. అలాగే దానికి ఒక హేతుబద్ధత ఉండాలి. ధరల పెంపుపై సమీక్షించాలంటే.. ఫిష్ మీల్ సమద్ధిగా ఉండే అక్టోబరు, నవంబరు నెలల్లో, హేతుబద్ధంగా ఒక నిర్ణయం తీసుకోవాలి. అలా కాకుండా అందుబాటులో ఉన్న కారణంలో ఫీడ్ రేట్లపై ఇష్టానుసారం రివ్యూ చేయకూడదు. దీనిపైనే ఇటీవల ఆక్వా రైతాంగం తమ గోడు వెళ్లబోసుకున్నారు. అందుకే ఈ ప్రభుత్వానికి అప్పుడే అల్టిమేటం కూడా జారీ చేశాం. చంద్రబాబు ప్రభుత్వం ప్రతి అడుగులోనూ కూడా మోసం, మోసం, మోసం అనే పదాలే వినిపిస్తాయి. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఏ మాదిరిగా చంద్రబాబునాయుడుగారు మోసాలతో అడుగులు ముందుకు వేసాడో, ఎన్నికలప్పుడు బాండ్లు ప్రతి ఇంటికి పంపిణీ చేసి ఏ మాదిరిగా ప్రజలను మోసం చేశాడో, అదే మాదిరిగా ఆక్వా రైతులను కూడా ఆయన మోసం చేస్తూ వచ్చాడు. ఇవాళ ఈ సందర్భంగా మీ అందరికీ కూడా నేను ఒకటే హామీ ఇస్తున్నాను. 'మీ కష్టాలు నాకు తెలుసు. నేను ఉన్నాను' అని మాత్రం మీ అందరికీ చెబుతున్నాను. చూస్తుండగానే రెండేళ్లు గడిచాయి. కళ్ళు మూసుకొని కళ్ళు తెరిచే సరికే మరో మూడేళ్లు గడుస్తాయి. ఆ తర్వాత రైతుల ప్రభుత్వం వస్తుంది అని చెప్పి కూడా ఈ సందర్భంగా గర్వంగా చెప్పగలుగుతాను. మళ్ళీ 'అప్సడా' పూర్వ వైభవంలోకి వస్తుంది. ఆ సంస్థకు సీఎం ఛైర్మన్‌గా ఉంటాడు. ఇప్పుడున్న సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పెకిలిస్తానని పేర్కొన్నారు.

# వైసీపీలో మళ్లీ కీలకం కానున్న చెవిరెడ్డి



**తిరుపతి :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో కీలక నేతల పాత్రపై మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ వ్యవహారాలను ఎవరు సమన్వయం చేస్తున్నారు, అధినేతకు అత్యంత సన్నిహితంగా ఎవరు వ్యవహరిస్తున్నారు అనే అంశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో పార్టీలో "కోటరీ" వ్యవస్థ ఉందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి. ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీ తరఫున విధానపరమైన ప్రకటనలు చేయడం, కీలక రాజకీయ అంశాలపై స్పందించడం, నాయకత్వ నిర్ణయాలను కేడర్‌కు చేరవేయడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహిస్తూ వస్తున్నారు. అందుకే పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో చాలాకాలంగా ఉంది. అయితే ఇటీవల మరో సీనియర్ నేత పేరు ఎక్కువగా వినిపిస్తోంది. తిరుపతి జిల్లా)కు చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యక్రమాల సమన్వయంలో ఆయన పాత్ర పెరిగిందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. చంద్రగిరి ) నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి, 2024 ఎన్నికల సమయంలో తన కుమారుడు మోహిత్ రెడ్డి ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అదే ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో కూటమి ప్రభావంతో తండ్రీకొడుకులు ఇద్దరూ విజయం సాధించలేకపోయారు. తర్వాత లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి అరెస్టై కొంతకాలం జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన పార్టీ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పార్టీకి సంబంధించిన వివిధ జిల్లాల పరిస్థితులపై సమాచారం సేకరించడం, స్థానిక నాయకులతో సమన్వయం చేయడం, ఆ వివరాలను పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి చేరవేయడం వంటి బాధ్యతల్లో చెవిరెడ్డి పాల్గొంటున్నారనే ప్రచారం కొనసాగుతోంది. అలాగే పార్టీ కార్యక్రమాలు సమర్థంగా అమలు అయ్యేలా పర్యవేక్షిస్తున్నారని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాల నిర్వహణలో కూడా చెవిరెడ్డి చురుకుగా వ్యవహరించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపి కార్యక్రమాలను సమన్వయం చేశారని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగా ఆయనకు పార్టీ అధినాయకత్వం వద్ద మరింత ప్రాధాన్యం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికీ పార్టీ విధానపరమైన అంశాల్లో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. అధికారిక ప్రకటనలు, రాజకీయ స్పందనలు ఎక్కువగా ఆయన ద్వారానే వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సజ్జల, చెవిరెడ్డి ఇద్దరూ పార్టీ వ్యవహారాల్లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది. అయితే పార్టీలో వారి పాత్రలు ఎలా మారతాయి, భవిష్యత్‌లో బాధ్యతల పంపిణీలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే అంశంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. దీంతో వైసీపీ అంతర్గత రాజకీయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

# కూటమి ఎమ్మెల్యేలే టార్గెట్‌గా రావణ్ టీమ్




**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల కేసు విచారణలో తాజాగా మరో సంచలన నిజాన్ని వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును వ్యక్తిగతంగా, రాజకీయంగా దెబ్బతీయడానికి ఈ యూట్యూబ్ ముఠా పెద్ద ఎత్తున కుట్ర పన్నినట్లు అంతర్గత విచారణలో బయటపడింది. 'ప్రశ్న' నిర్వాహకుడు జోసెఫ్ అలియాస్ రావణ్, అతని అనుచరులు చాలా కాలంగా ఎమ్మెల్యేకు వేధింపులు గురిచేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఎమ్మెల్యే సురేంద్ర బాబుపై సమాజంలో అప్రతిష్ఠ తెచ్చేలా తప్పుడు అవినీతి ఆరోపణలతో వీడియోలు రూపొందించడం వెనుక కీలక సూత్రధారుల లింకులు బయటపడ్డాయి. ఈ కుట్ర వెనుక వైసీపీ నేత ఉమామహేశ్వర్ నాయుడి సోదరుడు ఇంద్రసేన నాయుడు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఆయనతో పాటు 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన కూడా ఈ ప్లాన్‌లో భాగస్వామి అయి, తెరవెనుక స్క్రిప్ట్ డిజైనింగ్, ఫండింగ్ వ్యవహారాలను నడిపించినట్లు జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది. కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ విపక్షాలు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇటువంటి విష ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే పార్టీ నేతలకు సూచించారు. తాజా పరిణామాల నేపథ్యంలో గమన, ఇంద్రసేన నాయుడుల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ డిజిటల్ నెట్‌వర్క్ వెనుక ఉన్న మరికొంతమంది కీలక వ్యక్తుల కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు గన్నవరం పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

**వెనక్కి తగ్గిన పోలీసులు**

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రసన్న రావణ్ కేసు విచారణలో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రావణ్‌ను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై గన్నవరం కోర్టులో విచారణ జరిగింది. అయితే, నాటకీయ పరిణామాల మధ్య ఆ కస్టడీ పిటిషన్‌ను తాము వెనక్కి (ఉపసంహరణ) తీసుకుంటున్నట్లు పోలీసుల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి అధికారికంగా తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలతో పాటు మావోయిస్టు భావజాల వ్యాప్తి, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా మాట్లాడారనే తీవ్రమైన ఆరోపణలపై గన్నవరం పోలీసులు రావణ్‌పై ఉపా (ఐంఖం) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసు మూలాలను, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు 10 రోజుల పోలీసు కస్టడీ అవసరమని గత శుక్రవారం పోలీసులు కోరారు. అయితే, ఈ కేసులో 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈఓ గమనతో పాటు పలువురు కీలక వ్యక్తులను గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించి అవసరమైన వివరాలు, డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. రావణ్ కస్టడీ అవసరం లేదని భావించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు న్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో జోసెఫ్ రావణ్ ప్రస్తుతానికి నెల్లూరు సెంట్రల్ జైల్లోనే జ్యుడీషియల్ రిమాండ్‌లో కొనసాగనున్నారు. మరోవైపు, ఈ కేసులో ప్రభుత్వం కావాలనే ఉపా వంటి కఠిన చట్టాలను అక్రమంగా ప్రయోగిస్తోందని రావణ్ తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కోర్టు వెలుపల తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై నమోదైన పలు కేసులను ఒకే కేసుగా విచారించాలని కోరుతూ రావణ్ ఇప్పటికే ఏపీ హైకోర్టును కూడా ఆశ్రయించారు. పోలీసుల తాజా ఉపసంహరణ నిర్ణయంతో ఈ పొలిటికల్ అండ్ లీగల్ డ్రామా ఏ మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది

## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

-మొదటిపేజీ తరువాయి

'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## 3 సంవత్సరాలు 36 ప్రాజెక్టులు

-మొదటిపేజీ తరువాయి

కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ..

**కర్నూలు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు విస్తరణ ద్వారా రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది. అంతేకాకుండా, ఈ మైనింగ్ పనులు పూర్తిస్థాయిలో ఊపందుకుంటే కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. బంగారు గనుల తవ్వకం మరియు ప్రాజెక్ట్ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జొన్నగిరి గోల్డ్ మైన్స్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.

## మాజీ మంత్రి ఓటు గల్లంతు

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న వేళ మాజీ మంత్రి ఓటే గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణకుమారి పేరు గుంటూరు నగర ఓటరు జాబితాలో కనిపించకపోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించారు. ఒక మాజీ మంత్రి ఓటే లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఓటరు జాబితాలో తన పేరు లేదని ఎన్నికల అధికారులు చెప్పడంతో అరుణకుమారి ఆశ్చర్యానికి గురయ్యారు.

# తాడిపత్రి అదానీ (పూర్వం పెన్నా) సిమెంట్ పరిశ్రమను కొనసాగించాలి

**కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలి -- భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి**
**మూసివేత నోటీసుపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌కు సీఐటీయూ వినతి**

**అనంతపురము, జూలై 15: బహుజన వేదిక న్యూస్**

తాడిపత్రి మండలం తలారిచెరువు గ్రామంలోని అదానీ (పూర్వం పెన్నా) సిమెంట్ పరిశ్రమ మూసివేతను వ్యతిరేకిస్తూ, పరిశ్రమను యథావిధిగా కొనసాగించాలని, కార్మికుల ఉద్యోగాలకు పూర్తి భద్రత కల్పించాలని, భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కాపాడాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ఈరోజు అనంతపురం జిల్లా కలెక్టర్‌కు సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ జిల్లా అధ్యక్షులు ఆర్ వి నాయుడు మాట్లాడుతూ, పరిశ్రమ స్థాపన సమయంలో ఈ ప్రాంత రైతులకు, స్థానిక యువతకు, ప్రజలకు అనేక హామీలు ఇవ్వబడ్డాయని గుర్తు చేశారు. పరిశ్రమ వస్తే తాడిపత్రి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని, స్థానిక యువతకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రత్యక్షంగా--పరోక్షంగా వేలాది మందికి జీవనోపాధి లభిస్తుందని చెప్పి రైతుల నుంచి భూములు సేకరించారని పేర్కొన్నారు. నేడు అదే పరిశ్రమను మూసివేసే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని, దీనివల్ల కార్మికులు, రైతులు, స్థానిక వ్యాపారులు, రవాణా కార్మికులు, చిన్న వ్యాపారులు, నిరుద్యోగ యువతతో పాటు మొత్తం ప్రాంత ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న పారిశ్రామిక వర్గాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన అదానీ గ్రూపు ఆధ్వర్యంలోని పరిశ్రమ మూసివేత దిశగా సాగుతుండడం ఈ ప్రాంత ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. పరిశ్రమ నిజంగా నష్టాల్లో ఉందా? పరిశ్రమ కొనసాగించే అవకాశాలను పూర్తిగా పరిశీలించారా? కార్మిక చట్టాల ప్రకారం అన్ని ప్రక్రియలు పాటించారా? భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి? వంటి అంశాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం జారీ చేసిన మూసివేత నోటీసు చట్టబద్ధతపై కార్మికుల్లో తీవ్రమైన అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని జిల్లా కార్మిక శాఖ, రాష్ట్ర కార్మిక శాఖ, సెంట్రల్ లేబర్ కమిషనర్, ఇతర సంబంధిత శాఖలతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు పరిశ్రమను కొనసాగిస్తూ, ఏ ఉద్యోగినీ తొలగించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దభూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీల అమలు, స్థానిక యువతకు ఉపాధి, కార్మికుల చట్టబద్ధ హక్కులు, కనీస వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ఇతర సేవా ప్రయోజనాల అమలుపై ప్రత్యేక విచారణ జరిపించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో యాజమాన్యం, కార్మిక సంఘాలు, రైతు ప్రతినిధులు, సంబంధిత అధికారులతో త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేసి పరిశ్రమ కొనసాగింపునకు అన్ని మార్గాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్, పరిశ్రమకు సంబంధించిన అంశంలో అమల్లో ఉన్న కార్మిక చట్టాలు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారని, చట్టవిరుద్ధ చర్యలు ఏవైనా ఉంటే సంబంధిత అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ



సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి అభివృద్ధి గురించి తరచూ మాట్లాడుతున్నారని, పరిశ్రమ స్థాపన సమయంలో కూడా అభివృద్ధి, ఉపాధి అంశాలపై బహిరంగంగా మద్దతు తెలిపారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితిలో నేడు పరిశ్రమ మూసివేత కారణంగా వందలాది కార్మికులు, రైతు కుటుంబాలు, స్థానిక ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ సమయంలో తన వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. అదేవిధంగా, రాజకీయ భేదాలకు అతీతంగా జిల్లా ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు ముందుకు వచ్చి పరిశ్రమను కాపాడేందుకు ఉమ్మడిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే స్పందించి పరిశ్రమను కొనసాగించే చర్యలు తీసుకోకపోతే కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత, ప్రజలను ఐక్యం చేసి దశలవారీగా ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.వి. నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, తాడిపత్రి పట్టణ అధ్యక్షులు ఎస్. ఉమా గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# త్వరలోనే సాకారం కానున్న బంగారం కల







**రామగిరి బంగారు గనుల్లో మైనింగ్ కు త్వరలోనే ఆక్షన్**
**స్పష్టమైన ప్రకటన చేసిన మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**
**ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ తో కలిసి మైనింగ్ ప్రాంతం పరిశీలన**
**గత కార్మికులు, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న మంత్రి**
**ఇక్కడ ఖనిజాన్ని చోరీ చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక**
**జొన్నగిరి కంటే ఎక్కువగా బంగారం ఉందన్న మంత్రి రవీంద్ర**
**ఇది మా ప్రాంత ప్రజల కల అన్న ఎమ్మెల్యే పరిటాల సునీత**

**రామగిరి జూలై 15: బహుజన వేదిక న్యూస్**

రాష్ట్రంలో జొన్నగిరికి మించిన మరో గోల్డ్ మైన్ అందుబాటులోకి రానుందని మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మూత పడ్డ భరత్ గోల్డ్ మైన్ యూనిట్ ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ఇతర జిల్లా టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. బంగారం గనులున్న ప్రాంతాన్ని మొత్తం వారు పరిశీలించారు. అలాగే గతంలో అక్కడ పని చేసిన కార్మికులు, స్థానికులతో మంత్రి, ఎమ్మెల్యే సునీత మాట్లాడారు. అనంతరం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సందర్శించి ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర గార్ల విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై మినిట్స్ పుస్తకంలో సంతకాలు చేశారు. బంగారు గనుల్లో పనిచేసిన వారితో అర్జీలు స్వీకరించారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు.

**మా ప్రాంత కల ఇది.. పరిటాల సునీత**

ముందుగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బంగారం మైనింగ్ చేస్తున్న సమయంలో ఎంతో మందికి ఉపాధి ఉండేదన్నారు. పరిటాల రవీంద్ర కార్మిక సంఘం నాయకునిగా కూడా పని చేశారని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో మైనింగ్ మూసివేసినప్పటి నుంచి వారికి ఉపాధి కరవైందన్నారు. అంతే కాకుండా విలువైన ఖనిజాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడి నుంచి తరలించారన్నారు. అప్పుడు కేసులు పెట్టేందుకు వెళ్లినా కూడా పోలీసులు స్పందించలేదన్నారు. సుమారు వెయ్యి టిప్పర్ల ఖనిజాన్ని ఇక్కడ నుంచి వైసీపీ నాయకులు తరలించుకుపోయారన్నారు. అంతే కాకుండా మైనింగ్ మళ్లీ మొదలుపెడుతామని చెప్పి ప్రజల్ని మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేయగా.. మైనింగ్ ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ ఎక్కువగా బంగారం దొరుకుతుందన్నారు. ఇక్కడ మైనింగ్ తిరిగి ప్రారంభిస్తే వందలాది కుటుంబాలకు మేలు జరుగుతుందని.. ఎంతో మంది ఉపాధి లభిస్తుందన్నారు. మా ప్రాంత ప్రజల కల త్వరలోనే సాకారం అవుతుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

**జొన్నగిరి కంటే ఎక్కువ బంగారం**

మంత్రి కొల్లు రీవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అపార ఖనిజ సంపద ఉన్నప్పటికీ.. గత పాలకులు మైనింగ్ వ్యవస్థ ను నిర్వీర్యం చేశారని.. కొన్ని చోట్ల దోపిడీకు పాల్పడ్డారన్నారు. ఉన్న మైనింగ్ లను సరిగా నిర్వహించకపోవడం, ఖనిజాన్ని దోపిడీ చేయడం వంటివి చేశారన్నారు. కొత్త వాటి గురించి అసలు ఆలోచించలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. మైనింగ్ గ్రోత్ 36శాతం పెరిగిందన్నారు. ఇది గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఇటీవల కర్నూలు జిల్లా జొన్నగిరిలో మైనింగ్ ప్రాంభించామన్నారు. అక్కడ రోజుకు ఒక కిలో బంగారం తీస్తున్నారన్నారు. అలాగే ఇప్పుడు రామగిరి ప్రాంతంలో కూడా బంగారం గనులను మళ్లీ తెరిపిస్తామన్నారు. ఇప్పటికే జీఎస్ఐ వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని.. కేంద్రం కూడా అనుమతి ఇచ్చిందన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 416 ఎకరాల్లో 108 హెక్టార్ల లో మైన్ ఉందన్నారు. జొన్నగిరిలో టన్నుకు ఒక గ్రాము బంగారం వస్తే.. రామగిరిలో టన్నుకు 4గ్రాముల బంగారం లభిస్తుందన్నారు. ఇది క్రమంగా 6.5 గ్రాములకు కూడా చేరుతుందన్నారు. అందుకే చిత్తూరు జిల్లాలో చిగురుగుంట, రామగిరి తో పాటు మూడు ప్రాంతాలను గుర్తించామని.. త్వరలోనే యాక్షన్ పిలుస్తామన్నారు. బ్రిటీష్ కాలం నుంచి 2002వరకు ఇక్కడ మైనింగ్ జరిగింది.. భారత్ మైన్స్ వారు 2001లో ఆపేశారన్నారు. ఇటీవల 2023లో మిషనరీతో పాటు ఇక్కడున్న ఖనిజాన్ని తీసుకెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇక్కడ మొత్తం 4లక్షల 60వేల టన్నుల ఖనిజం ఉండాలని అందులో లక్ష టన్నుల వరకు చోరీ అయినట్టు తెలుస్తోందన్నారు. దీనిపై కచ్చితంగా ఎంక్వైరీ జరుగుతుందని.. అది ఎవరు చేసినా చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఖనిజాన్వేషణ వేగంగా జరుగుతోందన్నారు. గోల్డ్, మ్యాగ్నటీస్, ?ఐరన్ ఓర్ వంటి ఖనిజాన్ని వెలికి తీసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. దీని వలన రాయల్టీతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఓబుళాపురం ప్రాంతంలో కూడా ఖనిజాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ఈ ప్రాంతంలో కూడా త్వరలో మైనింగ్ ప్రారంభిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

# గుత్తిలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు

**గుత్తి, జూలై 15: బహుజన వేదిక న్యూస్**

గుత్తి పట్టణంలో ఈరోజు రాజకీయ, వ్యాపార ప్రముఖుల సమక్షంలో సందడి వాతావరణం నెలకొంది. గుత్తి – తాడిపత్రి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబి) శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ (బిజెపి ) రాష్ట్ర కార్యదర్శి మరియు కర్నూలు జిల్లా ఇంచార్జ్ శ్రీ సంధిరెడ్డి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాంక్ సేవలను అధికారికంగా ప్రారంభించారు.

**పార్టీ బలోపేతంపై 'చాయ్ పే చర్చ'**

బ్యాంక్ ప్రారంభోత్సవం అనంతరం శ్రీ సంధిరెడ్డి శ్రీనివాసులు



గుత్తి పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'చాయ్ పే చర్చ' (టీ తాగుతూ చర్చ) నిర్వహించారు.

**దిశా నిర్దేశం:** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లోకి



కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకుల సమక్షంలోఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**అనంతపురము జిల్లా కలెక్టర్‌కు జిపిఎస్ఎస్ వినతి పత్రం సమర్పణ**

**అనంతపురము జూలై 15 : బహుజన వేదిక న్యూస్**


ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టళ్లు మరియు గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ గిరిజన ప్రజా సంక్షేమ సంఘం (ఊూూ) రాష్ట్ర అధ్యక్షులు గర్మా మల్లికార్జున నాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు మరియు సంక్షేమ హాస్టళ్లలో ప్రాథమిక సదుపాయాల లోపం కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టళ్లలో తాగునీరు, శుచి శుభ్రత, విద్యుత్, పడకగదులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను తక్షణం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, విద్యార్థులకు ప్రభుత్వం అందించే కాస్మోటిక్ చార్జీలు (వ్యక్తిగత అవసరాల ఖర్చులు) సకాలంలో చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని నిర్దిష్ట సమయానికి విడుదల చేయాలని కోరారు. హాస్టళ్లలో మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన, రుచికరమైన భోజనం అందించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఆహార నాణ్యతపై పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇక విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు మరియు గిరిజన గురుకులాలలో ఆరోగ్య శిబిరాలు (హెల్త్ క్యాంపులు) నిర్వహించాలని సూచించారు. హాస్టల్ వార్డెన్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు మరియు సిబ్బంది తప్పనిసరిగా స్థానికంగా నివసిస్తూ, విద్యార్థుల సమస్యలను సమయానికి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిపత్రాన్ని సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు జిపిఎస్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రమావత్ ధనుంజయ నాయక్, రాజేష్ నాయక్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యల పరిష్కారానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో ప్రత్యేక సమీక్ష

**ధర్మవరంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక సమీక్ష**
**అధికారులకు హారీష్ బాబు కీలక ఆదేశాలు**
**ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం -- హారీష్ బాబు**
**ధర్మవరం ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది -- హారీష్ బాబు**
**నిలిచిపోయిన రూ.29 కోట్ల వాటర్ ట్యాంకుల పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు హారీష్ బాబు ఆదేశం**

**ధర్మవరం, జూలై 15: బహుజన వేదిక న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ గారి ఆదేశాలు, సూచనల మేరకు ధర్మవరం పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారంపై ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు బుధవారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) సాయికృష్ణ, డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) వీరేష్, వాటర్ లైన్‌మెన్‌లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తున్న సమస్యలను ఒక్కొక్కటిగా సమీక్షించిన హరీష్ బాబు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టణంలో నీటి సరఫరాకు ప్రధానంగా కరెంట్ అంతరాయాలు, మోటార్ల లోపాలు, పైప్‌లైన్ నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు వివరించారు. వాటిపై వెంటనే స్పందించిన హరీష్ బాబు సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా 2014 సంవత్సరంలో అమృత్ పథకం కింద సుమారు రూ.29 కోట్ల వ్యయంతో మంజూరైనప్పటికీ మధ్యలోనే నిలిచిపోయిన రెండు ప్రధాన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులపై ప్రత్యేకంగా చర్చించారు. ధర్మవరం పట్టణంలోని 22వ వార్డు సాయినగర్ మరియు 28వ వార్డు పై కాలనీలో నిర్మాణంలో ఉన్న ఈ రెండు ప్రధాన వాటర్ ట్యాంకులు పూర్తికాకపోవడం వల్ల ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమావేశం అనంతరం హరీష్ బాబు సంబంధిత కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్‌లతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేసి అత్యంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఇటీవల కొత్తగా మంజూరైన ఐదు మోటార్లను ఒక వారం రోజుల్లోగా అందుబాటులోకి తీసుకువచ్చి నీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇంకా పట్టణంలో నీటి సరఫరా జరిగే సమయాల్లో విద్యుత్ అంతరాయం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీ)తో కూడా హరీష్ బాబు ఫోన్‌లో మాట్లాడారు. తాగునీటి పంపింగ్ జరిగే సమయాల్లో ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి సరఫరా సమయంలో విద్యుత్ సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి కరెంట్, మోటార్లు, పైప్‌లైన్‌లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని హరీష్ బాబు ఆదేశించారు. ధర్మవరం ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడం ఎన్డీఏ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి మార్గదర్శకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సేవను సమయానికి అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ ప్రకటనకు తగ్గట్టుగా ప్రభావవంతమైన పత్రికా హెడ్డింగ్లు కూడా సిద్ధం చేయగలను



# పిజిఆర్ఎస్ అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపించాలి

**ఈ నెల జులై 18న నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమానికి సంబంధించి "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర"(Flood-Ready Andhra) థీమ్ తో ు**

**కార్యక్రమం నిర్వహణ: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురము, జులై 15 : బహుజన వేదిక న్యూస్**

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం రమేష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 520 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిత్యం మానిటర్ చేస్తూ నాణ్యతగా అర్జీలను పరిష్కరించడం చేయాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను కూడా గడువులోపు పరిష్కరించాలని, ఇప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించడం ముఖ్యమైనదన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం చూపించరాదన్నారు.ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, జులై నెలకు సంబంధించి "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర"(ఖీశ్రీశీసీ-=ఘుంఎ౯ూఅంస్త్రతీఖ) థీమ్ తో కార్యక్రమం నిర్వహించాలని, ఇందుకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డిపిఓ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిసిఓ అరుణకుమారి, హౌసింగ్ పిడి శైలజ, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, డిఆర్డీఏ పిడి శైలజ, డిపిఓ నాగరాజునాయుడు, డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి వరప్రసాద్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రమణ్యం, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, సెక్షన్ సూపరింటెం డెంట్లు వసంతలత, యుగేశ్వరిదేవి, రియజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన మద్దుల చెరువు మల్లి..









**అనంతపురము జూలై 15: బహుజన వేదిక న్యూస్**

ఈరోజు అనంతపురం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భాగంగా రుద్రంపేట బైపాస్ నందు నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ లో శ్రీచైతన్య విద్యాసంస్థలను, రెసిడెన్షియల్ స్కూల్ ను నడుపుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య యాజమాన్యం పై కలెక్టర్ గారికి ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుల చెరువు మల్లి ఫిర్యాదు చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ అనంతపురం పట్టణంలోని రుద్రంపేట , పిస్తా హౌస్ ప్రక్కన గల శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం వారు బిల్డింగ్ నిర్మాణంలో ఉండగానే స్కూల్ నడుపుతూ హాస్టల్ నడుపుతూ విద్యార్థినీ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించడం వీటికి సంబంధించిన సంబంధిత శాఖ అధికారులు మాముల్లు తీసుకొని చూసి చూడనట్లు వ్యవహరించడం జరుగుతుందని, నిర్మాణంలో ఉన్న బిల్డింగులో స్కూల్ నడపడం ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థినీ, విద్యార్థుల వందల సంఖ్యలో ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందనీ వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ వెంటనే స్కూల్ దగ్గరికి వెళ్లి పరిశీలన చేసి స్కూల్ ని మూసివేసి సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారని తెలియజేశారు.లక్షలాది రూపాయలు ఫీజులు , నోటుబుక్కుల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూలు యజమాన్యాల పైన విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సిగ్గుచేటుగా భావిస్తున్నామని వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల పైన శాఖపరమైన చర్యలు కూడా తీసుకోవాలని కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మన్నల పెద్దిరాజు ఉపాధ్యక్షులు చిరంజీవి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# భారత అమెరికాల మధ్య కుదరనున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ తక్షణం నిలిపివేయాలి



**భారతీయ కిసాన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ బాబు డిమాండ్**

**అనంతపురము జూలై 15: బహుజన వేదిక న్యూస్**

భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని భారతీయ కిసాన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాలం సతీష్ బాబు మరియు ఆల్ ఇండియా తన్జీమ్ ఈ ఇన్సాఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ జర్నలిస్ట్ బాబా షా ఒక వినతి పత్రం ద్వారా జిల్లా కలెక్టర్ గారికి అందజేశారు.

**ఆ వినతి పత్రంలో**

దేశ్ బచావో మోర్చా మరియు భారతీయ కిసాన్ సంఘటన్ తరపున భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాము. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ రైతులకు, వ్యవసాయ కూలీలకు, పశుపోషకులకు, చిన్న వ్యాపారులకు, చిన్న పరిశ్రమలకు మరియు దేశ ఆహార మరియు ఆర్థిక సార్వభౌమాధికారానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని మేము స్పష్టంగా తెలియజేయాలనుకుం టున్నాము. ఈ ఒప్పందం భారత వ్యవసాయంపై, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై మరియు లక్షలాది మంది ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి ఈ ఒప్పందం రైతులకు మరణశాసనం లాంటిది, దీనిని ఏ పరిస్థితుల్లోనూ అంగీకరించము. దేశ్ బచావో మోర్చా మరియు భారతీయ కిసాన్ సంఘటన్ ఈ భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ ఒప్పందాన్ని మేము ఏ పరిస్థితుల్లోనూ అంగీకరించము. భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని భారత ప్రభుత్వాన్ని మేము స్పష్టంగా డిమాండ్ చేస్తున్నాము. మరియు దేశ రైతుల మరియు సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడాలి. భారత ప్రభుత్వం ఈ న్యాయమైన డిమాండ్‌ను పట్టించుకోకపోతే, "దేశ్ బచావో ఫ్రంట్" ప్రజాస్వామ్య మరియు రాజ్యాంగబద్ధమైన పద్ధతిలో భారీ దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించవలసి వస్తుంది, దానికి భారత ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని భారతీయ కిసాన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాలం సతీష్ బాబు, ఆల్ ఇండియా తన్జీమ్ ఈ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ సీనియర్ జర్నలిస్ట్ బాబాయిషాలు జిల్లా కలెక్టర్ గారిని కోరారు.

# శ్రీ రామకృష్ణ మఠం స్థాపనకు స్థలం కేటాయించండి



**ఎమ్మెల్యే పరిటాల సునీతకు రామకృష్ణ సేవా సమితి సభ్యుల విజ్ఞప్తి**

**క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతతో సమావేశం**

**అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన సునీత**

**అనంతపురము జూలై 15: బహుజన వేదిక న్యూస్**

వైద్యం, విద్యతోపాటు వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీ రామకృష్ణ మఠం స్థాపనకు స్థలం కేటాయించాలని... రామకృష్ణ సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కోరారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతతో వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మఠం చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, శారదాదేవి, స్వామి వివేకానందల ఆదర్శాలతో ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మఠం ద్వారా నిత్య పూజలు, ధ్యాన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, యువతకు విలువలతో కూడిన విద్య, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఉచిత వైద్య శిబిరాలు, సామాజిక ఆరోగ్య సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితుల్లో సహాయక సేవలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మఠం రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయడం వలన స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కేంద్రంగా నిలిచి, భావితరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఉంటుందని వివరించారు. అయితే మఠం కార్యకలాపాలకు సుమారుగా 10 ఎకరాల వరకు స్థలం అవసరం ఉంటుందని చెప్పారు. కామారుపల్లి వద్ద ఈ స్థలాన్ని గుర్తించామని.. ఆ స్థలాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే పరిటాల సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి నిబంధనల మేరకు సాధ్యమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# వికలాంగురాలు ఇంటి స్థలం కబ్జాయత్నం



**స్థలం కోర్టులో విచారణలో ఉన్న మాపై దౌర్జన్యం**

**పలుమార్లు కబ్జాదారులు వికలాంగుల ఇంటిపై దాడి**

**పోలీసులతో బెదిరింపులు**

**న్యాయం చేయాలని వికలాంగురాలు అభ్యర్థన**

**బద్వేలు, జూలై 15: బహుజన వేదిక న్యూస్**

బద్వేల్ మున్సిపాలిటీ లోని మహమ్మద్ కాలనీలో గల మా చెల్లెలు దర్శి కేశమ్మ (పుట్టుకతో అందత్వము, మూగ, మానసిక వికలాంగురాలు) స్థలాన్ని కబ్జా చేసేందుకు బి కోడూరు మండలం సిరిగిరి పల్లె గ్రామానికి చెందిన గంగి పోగు నరసింహులు అను అతను మమ్మల్ని బెదిరించి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని బాధితురాలు సోదరుడు దర్శి చెన్నకేశవులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశారు. బద్వేల్ మున్సిపాలిటీలోని చెన్నంపల్లి పొలం సర్వేనెంబర్ 1801 లో ప్లాట్ నెంబర్ 198 ను ప్రభుత్వము మానసిక వికలాంగురాలు దర్శి కేశమ్మ కు ఇచ్చారని తెలియజేశారు. అప్పటినుండి ఆ స్థలంలో లో ఇంటిని నిర్మించుకొని సంసారం ఉన్నామని తెలియజేశారు. 2021 సంవత్సరంలో మా ఇంటిలో ఎవరు లేని సమయంలో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగినేని గుంట గ్రామానికి చెందిన గోనిగుంట హజరత్తయ్య అను అతను జెసిబి తో ఇంటిని కూల్చి వేశాడు అని, మా ఇంటిని కూల్చినందుకు హజరత్తయ్య పై బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టామని అన్నారు. అప్పటి అర్బన్ సీఐ నిజా నిజాలు విచారణ చేసేందుకు మా పత్రాలను బద్వేలు తాసిల్దార్ కి పంపించారని, తాసిల్దారు విచారణ జరిపి ఆ స్థలం దర్శి కేశమ్మదేనని జి నైన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారని తెలియజేశారు. మా ఇంటిని జెసిపి తో నేలమట్టం చేసినందుకు గాను పెద్దమనుషుల సమక్షంలో హజరతయ్య మాకు నష్టపరిహారముగా 30,000 రూపాయలు చెల్లించాడని తెలియజేశారు. తరువాత 2023 సం/ నుండి బి కోడూరు మండలం సిరిగిరి పల్లి గ్రామానికి చెందిన గంగిపోగు నరసింహులు అనే కబ్జాదారుడు ఆ స్థలం నాది నేను కొన్నాను అంటూ మాపై దౌర్జన్యం చేసి 20 మంది రౌడీ మూకలు తో కలసి మహమ్మద్ కాలనీలోని మా ఇంటి మీదికి వచ్చి మమల్ని భయంకరంగా కొట్టగా మమ్మలను కడప రిమ్స్ కు తరలించారని అక్కడ చికిత్స పొందామని అన్నారు. గంగి పోగు నరసింహులు పై బద్వేల్ కోర్టులో కేసు కూడా నమోదయి ఉన్నదని తెలియజేశారు.అయినా అతని దాడిని భరించలేక గ్రీవెన్స్ సెల్ లో కడప జిల్లా కలెక్టర్ కి, ఎస్పీకి ఫిర్యాదు కూడా చేశామని, తెలియజేశారు అయినా లెక్క చేయకుండా జూలై 13వ తేదీన పోలీసులను తీసుకువచ్చి మాపై దౌర్జన్యం చేయించారని పేర్కొన్నారు.అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్సై చిరంజీవి కి బద్వేల్ మండల తాసిల్దార్, మరియు ఆర్డీవో స్థలం విషయమై పోలీసులు జోక్యం చేసుకోరాదని తెలియజేసిన ఎస్సై చిరంజీవి ఖాతరు చేయలేదని, ఆ స్థలం వివాదం హైకోర్టులో కూడా ఉందని విన్నవించిన అయినా ఆ ఎస్ఐ చిరంజీవి కోర్టును కూడా ధిక్కరించి మమ్మల్ని బెదిరిస్తున్నాడని తెలియజేశారు. ఆ స్థలంలో నేను దగ్గరుండి గంగిపోవు నరసింహులు ఇల్లు కట్టిస్తానని ఎస్సై చిరంజీవి మమ్మల్ని బెదిరించారని అన్నారు.ఎస్సై నుండి కూడా మాకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.కబ్జాదారుడు గంగి పోగు నరసింహులు పై విచారణ జరిపిస్తే అతని మీద బి కోడూరు పోలీస్ స్టేషన్, బద్వేలు పోలీస్ స్టేషన్లలో ఉన్న కేసులు బయటపడతాయని తెలియజేశారు. బీదవారమైన మాకు స్థలం విషయమై న్యాయం చేయాలని కడప జిల్లా కలెక్టర్ కి , ఎస్పీకి, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామని తెలియజేశారు

# గులాబీ రెడ్ పాలిటిక్స్..

**హైదరాబాద్ :** తెలంగాణలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీ బ్లెడ్ పాలిటిక్స్(రక్త రాజకీయం) కు తెరదీసింది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల రక్తం చవిచూస్తున్నారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. సీఎంకు కావాలంటే తమ రక్తం ఇస్తామని, రైతులను ఆదుకోవాలని ఎక్స్ వేదికగా కామెంట్లు చేశారు.అనంతరం.. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ విద్యార్థి, యువజన విభాగం కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పలువురు విద్యార్థులు రక్తం దానం చేశారు. అనంతరం.. ఈ రక్తాన్ని సచివాలయానికి తీసుకువెళ్లి.. సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చి.. నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ ఎస్ విద్యార్థి,

## । ఎన్టీఆర్ అభిమానుల్లో చీలిక.. ‘రా ఎన్టీఆర్’ వివాదంతో సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్!

తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోల అభిమానులు తమ అభిమానాన్ని వివిధ రూపాల్లో చాటుకుంటుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం, అభిమాన సంఘాలు ఏర్పాటు చేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం సాధారణమే. అయితే తాజాగా యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పేరుతో ఏర్పడినట్లు ప్రచారం జరుగుతున్న ‘రా ఎన్టీఆర్’ సంస్థ వివాదం.. అభిమానుల మధ్యే విభేదాలకు దారితీసి సోషల్ మీడియాలో పెద్ద చర్చకు కారణమైంది. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో ‘రా ఎన్టీఆర్’ పేరుతో ఒక సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తిరుపతిలో భారీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరవుతారని, వంద కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు చేపడతామని, అందుకోసం విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు పలు పోస్టులు వైరల్ అయ్యాయి. దీంతో ఈ కార్యక్రమం ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశానికి సంబంధించినదా అనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. ఈ ప్రచారం నేపథ్యంలో ఎన్టీఆర్ అధికారిక బృందం స్పష్టత ఇచ్చింది. విడుదల చేసిన ప్రకటనలో ‘రా ఎన్టీఆర్’ సంస్థకు తమతో ఎలాంటి సంబంధం లేదని, ఎన్టీఆర్ పేరు లేదా ఆయన ఫోటోలను అనుమతి లేకుండా ఉపయోగించవద్దని పేర్కొంది. అలాగే ఆ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రచారాలు లేదా ప్రకటనలకు ఎన్టీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. దీంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి అధికారికంగా తెరపడింది. ఎన్టీఆర్ టీమ్ ప్రకటన తర్వాత అభిమానుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక వర్గం అభిమానులు ‘రా ఎన్టీఆర్’ పేరుతో ఎన్టీఆర్ ఇమేజ్‌ను దెబ్బతీయొద్దని, ఆయన పేరుతో విరాళాలు సేకరించడం సరికాదని విమర్శిస్తున్నారు. మరోవైపు ‘రా ఎన్టీఆర్’ సంస్థ ప్రతినిధులు మాత్రం తాము గత ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ ఉద్దేశం కేవలం సేవ మాత్రమేనని చెబుతున్నారు. ఎన్టీఆర్‌పై తమకు అపారమైన గౌరవం ఉందని, ఆయన స్వయంగా ఆపమంటే వెంటనే అన్ని కార్యక్రమాలు నిలిపివేస్తామని కూడా వారు పేర్కొంటున్నారు. అయితే ఎన్టీఆర్ వ్యక్తిగత పీఆర్ టీమ్ అధికారికంగా ప్రకటన విడుదల చేసిన తర్వాత కూడా, “ఆ విషయాలు ఎన్టీఆర్‌కు తెలిసి ఉండకపోవచ్చు” అని ‘రా ఎన్టీఆర్’ సంస్థ స్పందించడం మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌గా మారింది. ఒక వర్గం ఎన్టీఆర్ పేరును అనధికారికంగా వినియోగించడం సరికాదని వాదిస్తుండగా, మరో వర్గం సేవా కార్యక్రమాల ఉద్దేశాన్ని సమర్థిస్తోంది.



## ‘ప్రభాస్ నుంచి దొంగిలించాల్సింది అదొక్కటే’

సినీ ప్రియుల గుండెల్లో బుట్టబొమ్మగా ముద్ర వేసుకున్న బ్యూటీ పూజా హేగ్డే. తెలుగులో స్టార్ హీరోల సరసన నటించింది. పలు సూపర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నటించిన జన నాయగన్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఈనెల 23 నుంచే థియేటర్లలోకి రానుంది. విజయ్ హీరోగా వస్తోన్న చివరి చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సంగతి పక్కనపెడితే బుట్టబొమ్మ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. రెబల్ స్టార్ ప్రభాస్ గురించి మాట్లాడింది. ఆయనతో రాధే శ్యామ్ మూవీలో హీరోయిన్‌గా చేశానని తెలిపింది. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో నాకు ప్రభాస్ పంపిన ఫుడ్ ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆనందం వ్యక్తం చేసింది. ఆయన దగ్గర నుంచి తీసుకోవడానికి ఇంకేం లేదని.. అవకాశం వస్తే ఆయన కుక్‌ను దొంగిలిస్తానని ఫన్నీ కామెంట్స్ చేసింది బుట్టబొమ్మ. ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి.



## అఫిషియల్.. ‘జననాయగన్’ విడుదల తేదీ ఖరారు!



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటిస్తున్న ఆఖరి చిత్రం విడుదల తేదీ ఎట్టకేలకు అధికారికంగా ఖరారైంది. ఎన్నో వాయిదాలు, సెన్సార్ వివాదాల తర్వాత ఈ చిత్రానికి ‘జననాయగన్’ (తెలుగులో ‘జననాయకుడు’, హిందీలో ‘జన్ నేత’) అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ ఖఎచీ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ (జదీఖీజ) ఇప్పటికే ‘ూ’ సర్టిఫికేట్ జారీ చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో జులై 23న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



## ‘పల్లీ చట్నీ’ అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఓటీటీలోకి వచ్చేస్తోన్న క్రేజీ యాక్షన్ డ్రామా ‘పళ్లిచట్టంబి’!

‘పళ్లిచట్టంబి’.. ఈ పేరు వినగానే తెలుగు ఆడియన్స్‌కు ముందుగా స్ట్రైక్ అయింది ‘పల్లీ చట్నీ’. అవును, ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పుడు తెలుగువాళ్లంతా ఇలాగే అవాక్కయ్యారు. ఏంటి.. తెలుగులో పెట్టడానికి నిర్మాతలకు ఇంతకంటే మంచి పేరు దొరకలేదా? అంటూ సోషల్ మీడియాలో మీమ్స్‌తో ఆటాడుకున్నారు. కానీ, కట్ చేస్తే.. కంటెంట్ ఉన్న సినిమాకి టైటిల్స్ అడ్డుకావని ఈ చిత్రం నిరూపించింది. కేరళ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ, బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయాన్ని అందుకొని విమర్శకుల ప్రశంసలు సైతం సొంతం చేసుకుంది. ఇక థియేటర్లలో ఈ టైటిల్ వెరైటీని చూసి మిస్ అయిన వారి కోసం ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ‘సోనీ లివ్’ లో జులై 24 నుండి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రాబోతోంది. సినిమా కథ విషయానికి వస్తే.. 1957 నాటి కేరళ భూసంస్కరణల బిల్లు నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. చర్చి భూములను కాపాడటం కోసం ‘పోతన్ క్రిస్టోఫర్’ (టొవినో థామస్) అనే యువకుడిని చర్చి రక్షకుడిగా (చట్టంబి) నియమిస్తారు. అయితే, అతని అసలు పేరు కృష్ణ పిళ్లై. ఒక హిందూ యువకుడైన కృష్ణ పిళ్లై, మారుపేరుతో చర్చిలోకి ఎందుకు అడుగుపెట్టాడు? కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న రెబెక్కా (కయాదు లోహర్)తో అతని ప్రేమాయణం ఎలా సాగింది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను దర్శకుడు డిజో జోస్ ఆంటోని తెరకెక్కించారు.

Publisher, printer and Owner P. Ramanjaneya Prasad, Government Hospital back SIDE Singanamala (Mandal) Ananthapuram (District)- AP, Printing at LAKSHMI OFFSET Printers, D.NO: 12-3-195, 5th cross SAINAGAR Beside Veterinary Hospital Ananthapuram,
Published at P. Ramanjaneya Prasad Government Hospital Back Side Singanamala (Mandal) Ananthapuram (District)- RNI Reg NO: APTEL/2024/86898 ,AP, Editor P.Ramanjaneya Prasad ph:9494900294